ప్రజా సంక్షేమమే ముఖ్యమంత్రి లక్ష్యం

- కాంగ్రెస్‌ను నమ్మి ఓటేస్తే కష్టాలే
- బీఆర్ఎస్ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక/హుజూరాబాద్‌రూరల్: ఏడుసార్లు ఈటల రాజేందర్‌ను గెలిపిస్తే నియోజకవర్గానికి చేసిందేమిలేదని, రెండేళ్లుగా నియోజకవర్గాన్ని పట్టించుకున్న దాఖలాలు లేవని ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ పని చేస్తున్నారని కొనియాడారు. మండలంలోని శ్రీరాములపేట, కోర్కల్, నర్సింహులపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాలలో కౌశిక్‌రెడ్డి గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తున్నది కేవలం బీఆర్ఎస్ ప్రభుత్వమేనని పేర్కొన్నారు. గెలిచాక మేనిఫెస్టోను అమలు చేస్తామన్నారు. వివిధ గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. కౌశిక్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, ఏఎంసీ మాజీ చైర్మన్ వాల బాలకిషన్‌రావు, ఎంపీపీ ముసిపట్ల రేణుకాతిరుపతిరెడ్డి, జెడ్పీటీసీ మాడ వనమాలసాదవరెడ్డి, సంది సమ్మిరెడ్డి, రాకేశ్, తిరుపతి గౌడ్, మద్దు సాని సమ్మయ్య, దూలం సమ్మయ్య, తదితరులు

సీఎం సభను విజయవంతం చేయాలి

జమ్మికుంట పట్టణంలో 17న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని, ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరయ్యే సభకు ప్రజలు అధికసంఖ్యలో తరలిరావాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. సీఎం కేసీఆర్ చేపట్టిన అనేక సంక్షేమ పథకాలే బీఆర్ఎస్ విజయానికి బాటలు వేస్తాయన్నారు. హుజూరాబాద్‌లో పాడి కౌశిక్‌రెడ్డి గెలుపు ఖాయమన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకుడు, సామాజిక సహాయకర్త వర్ధినేని రవీందర్‌రావు, పంజాల కుమారస్వామి, దొంత రమేశ్, సందమల్ల బాబు, మైకెల్, దిల్ శ్రీనివాస్, రాజా, మల్లారెడ్డి, మోరె మధు, తదితరులు ఉన్నారు. ఉన్నారు.


శ్రీరాములపేటలో కౌశిక్‌రెడ్డి ప్రచారం


సమావేశంలో మాట్లాడుతున్న బండ శ్రీనివాస్


కండువాలు కప్పుతున్న తొగరు శివకృష్ణ

బీఆర్ఎస్‌లోకి చేరిక

మండలంలోని రాంపూర్ గ్రామంలో బీజేపీకి చెందిన 30 మంది యువకులు నియోజకవర్గ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు తొగరు శివకృష్ణ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరగా పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలు వివరించాలన్నారు.

ప్రజా సేవ చేసేందుకు రాజకీయాల్లోకి..

- నిండు మనస్సుతో ఆశీర్వదించండి
- కాంగ్రెస్ అభ్యర్థి ఒడితెల ప్రణవ్

జమ్మికుంట/కమలాపూర్: హుజూరాబాద్ ప్రాంత బిడ్డగా, సింగాపురం వొడితెల రాజేశ్వర్‌రావు మనుమడిగా మా తాత ఆశయాలు, అభివృద్ధితోపాటు ప్రజలకు సేవ చేయాలని, మీ ముందుకు వచ్చాను, నిండు మనస్సుతో ఆశీర్వదించి, ఎమ్మెల్యేగా గెలిపించాలని కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి వొడితెల ప్రణవ్ అన్నారు. గురువారం రాత్రి మున్సిపల్ పరిధిలోని ధర్మారం, రామన్నపల్లి, కొత్తపల్లి, మండలంలోని మడిపల్లి,అంకుషాపూర్ గ్రామాల్లో నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కొత్తపల్లిలో గజమాలతో ఘన స్వాగతం పలికారు. ఈసందర్భంగా మాట్లాడుతూ బీఆర్ఎస్, బీజేపీ రెండు ఒక్కటే, మోసపూరిత హామీలు నమ్మొద్దని, కాంగ్రెస్ అధికారంలోకి వస్తుంది, ఆరు గ్యారంటీలు అమలు చేస్తుందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోను బీఆర్ఎస్ కాపీ కొట్టింది, ఇన్ని రోజులు రూ.400 గ్యాస్ సిలిండర్ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఉన్నత చదువులు చదివిన యువత అనేక ఇబ్బందులు పడుతున్నారు, అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తుందన్నారు. నియోజకవర్గంలో యువకులు పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేందుకు మండలానికో స్టడీ సెంటర్, డిజిటల్ లైబ్రరీలను ఏర్పాటు చేసి, విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తామని హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో రౌడీయిజం, అరాచకాలు, గన్ కల్చర్లు పెరిగిపోతుందని, వ్యాపారాలు స్వేచ్ఛగా ఉంటేనే అభివృద్ధి సాధ్యమన్నారు. వ్యాపారులకు అండగా ఉంటామని, పరిశ్రమలు తీసుకువస్తామని హామీ ఇచ్చారు. హుజూరాబాద్‌లో గెలిచేది కాంగ్రెస్ పార్టీయేనని ధీమా వ్యక్తం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. సీనియర్ నాయకులు పత్తి కృష్ణారెడ్డి, అరుకాల వీరేశలింగం, సమ్మిరెడ్డి, పట్టణ మహిళా అధ్యక్షురాలు పూదరి రేణుక, శివకుమార్, సుంకరి రమేష్, కసుబోజుల వెంకన్న, సారంగపాణి, సదానందం, సలీం, శ్రీనివాస్, సాయిని రవి, ఎన్ఎస్‌యూఐ నాయకులు ఇమ్రాన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తపల్లిలో మాట్లాడుతున్న వొడితెల ప్రణవ్


మహిళల ఓట్లు అభ్యర్థిస్తున్న ప్రణవ్

బీఆర్ఎస్, బీజేపీ దొందూదొందే

'బీజేపీ, బీఆర్ఎస్ దొందుదొందే, ఆ పార్టీలకు ఓటేస్తే డ్రెయినేజీలో వేసినట్టే, పార్టీ అభ్యర్థులు ప్రజా సమస్యలను గాలికొదిలేసి వ్యక్తి ప్రయోజనాల కోసమే రాజకీయాలు చేస్తున్నారు'అని వొడితెల ప్రణవ్ అన్నారు. మండలంలోని మాదన్నపేట, గూనిపర్తి, శ్రీరాములపల్లి, అంబాల, నేరెళ్ల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రణవ్ మాట్లాడుతూ.. ప్రజల ఆకాంక్ష నెరవేర్చేందుకు ఇచ్చిన మాటకు కట్టుబడి కాంగ్రెస్ పార్టీ ప్రత్యేక రాష్ట్రం ఇస్తే కేసీఆర్ కుటుంబం ప్రజలను మోసం చేస్తోందన్నారు. నీళ్లు, నిధులు, నియామకాల పేరుతో అధికారం చేపట్టిన బీఆర్ఎస్ ప్రజలకు ఇచ్చిన హామీలు విస్మరించి, అవినీతి, అక్రమాలే లక్ష్యంగా పనిచేస్తుందని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న హుజూరాబాద్‌లో గన్ కల్చర్ పెరిగిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా గ్రామాల్లో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్‌లో చేరగా ప్రణవ్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చరణ్‌పటేల్, నాయకులు తోటం రవీందర్, బాలసాని రమేశ్‌గౌడ్, ఐలయ్యగౌడ్, కొండ రమేశ్, హనుమాన్‌ప్రసాద్, మనీష్, కుమారస్వామి, ఓదెలు, అనిల్, రాములు పాల్గొన్నారు.

ప్రాణాలు పోతున్నాయి..

- ఇష్టారాజ్యంగా చేపట్టిన మిషన్ భగీరథ పనులు
- గేట్‌వాల్వ్‌లపై పైకప్పు వేయకపోవడంతో ప్రమాదాలు
- అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోని పరిస్థితి

రామడుగు: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్‌భగీరథ పథకం పనులు అధికారుల నిర్లక్ష్యంతో ప్రజలకు ప్రాణసంకటంగా మారుతున్నాయి. ప్రధాన రహదారులతో పాటు గ్రామాల్లో పైపులైన్లు, గేట్ వాల్వ్‌లను ఇష్టారాజ్యంగా తవ్వి పనులు అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ప్రజలు, వాహనదారులకు ఇబ్బందికరంగా మారింది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం చోటు చేసుకుంటుందో తెలియని దుస్థితి నెలకొంది.

పరిస్థితి అధ్వానం

మండలంలోని 23 గ్రామాల్లో ప్రజలకు మిషన్ భగీరథ ద్వారా తాగునీటిని అందించడం కోసం చేపట్టిన పనులను కంట్రాక్టర్ ఇష్టారాజ్యంగా చేశాడు. సంబంధిత అధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పైపులైన్ పనుల్లో భాగంగా ప్రధాన కూడళ్లు, ముఖ్యమైన జంక్షన్‌ల వద్ద గేట్‌వాల్వ్‌లను అమర్చారు. గేట్ వాల్వ్‌ల చుట్టూ ప్రత్యేకంగా సిమెంట్ దిమ్మెలు ఏర్పాటు చేశారు. కానీ వాటిపై సిమెంట్ బిళ్లలు వేయకపోవడంతో వాహనదారులు అందులో పడి గాయాలపాలవుతున్నారు. పశువులు అందులో పడటంతో ప్రాణాలు కోల్పోతున్నాయి. దత్తోజీపల్లి ప్రధాన చౌరస్తా వద్ద రెండేళ్ల క్రితం గేట్‌వాల్వ్ కోసం గుంత ఏర్పాటు చేశారు. దానిపై ఎలాంటి సిమెంట్ బిళ్ల(పైకప్పు) అమర్చకపోవడంతో గ్రామానికి చెందిన ఓ పాడిరైతు గేదె రాత్రి వేళ అందులో పడి మృతి చెందింది. దాదాపు రూ.60 వేల నష్టం వాటిల్లిందని రైతు బోరుమన్నాడు. మండలంలో ఇలాంటి సంఘటనలు జరుగుతున్నప్పటికి అధికారులు చర్యలు తీసుకున్న దాఖాలు కనిపించకడం లేదు. మండలంలో మిషన్ భగీరథ నీటి సరఫరా కోసం ఏర్పాటు చేసిన గేట్ వాల్వ్‌లు పైకప్పు లేకుండా ఉన్నవి దాదాపు 150 వరకు ఉంటాయని సమాచారం. వీటి గూర్చి అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకున్న దాఖాలాలు కనిపించడంలేదని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన సుధాకర్ తెలిపారు.


పైకప్పు లేకపోవడంతో మృతిచెందిన గేదె


కోనరావుపేట వాటర్ ట్యాంకు వద్ద ఓపెన్‌గా

పైకప్పులు ఏర్పాటు చేయాలి...

గేట్‌వాల్వ్‌ల పై అధికారులు తక్షణం పైకప్పులు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఇంటి ముందే గేట్‌వాల్వ్



ఇంటి ముందే రెండు గేట్‌వాల్వ్‌లు ఏర్పాటు చేశారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదు. కనీసం పైకప్పులు ఏర్పాటు చేయలేదు. నాలుగు రోజుల కిందట గేట్ వాల్వ్‌లో పడి గేదె మృతి చెందింది. ఇప్పటికైనా పైకప్పులు ఏర్పాటు చేయాలని కోరుతున్నాం.

– గంట్ల రవీందర్‌రెడ్డి, దత్తోజీపల్లి

రక్షణ చర్యలు చేపట్టాలి



ప్రధాన రహదారులు వెంట మిషన్ భగీరథ పైపులైన్ కోసం ఏర్పాటు చేసిన గేట్ వాల్వ్‌లకు ఎలాంటి పైకప్పులు లేకపోవడంతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు తక్షణం స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలి.

– నరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెదిర

నిబంధనలు అతిక్రమిస్తే కేసులు

కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు


మాట్లాడుతున్న రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు

మానకొండూర్: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా జరుపుకోవాలని కరీంనగర్ రూరల్ ఏసీపీ కరుణాకర్‌రావు అన్నారు. గురువారం మండల కేంద్రంలో కేంద్ర బలగాలు, పోలీసులతో ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఏసీపీ మాట్లాడారు. ప్రజలు శాంతియుతంగా మెలగాలని, గొడవలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. వివిధ పార్టీల కార్యకర్తలు, నాయకులు బైండోవర్‌కు సహకరించాలన్నారు. ఈకార్యక్రమంలో సీఐలు రాజ్‌కుమార్, ఇంద్రసేనారెడ్డి, ఎస్సైలు శ్రీకాంత్, ప్రమోద్‌రెడ్డి, పోలీసు సిబ్బంది, మండలంలోని ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రంథాలయ వారోత్సవాలు


విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఇందిరాదేవి

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం గ్రంథాలయ వారోత్సవాలు ఘనంగా నిర్వహించామని ప్రిన్సిపాల్ డాక్టర్ పి.ఇందిరా దేవి తెలిపారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... గ్రంథాలయాన్ని విద్యార్థులు సంపూర్ణంగా వినియోగించుకుంటే అద్భుతమైన జ్ఞానం సముపార్జించవచ్చన్నారు. గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీనరసింహమూర్తి, కళాశాల గ్రంథపాలకుడు కె.రమేశ్, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు డయల్ యువర్ డీఎం

హుజూరాబాద్: పట్టణంలోని ఆర్టీసీ డిపో కార్యాలయంలో శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు డిపో మేనేజర్ పి.అర్పిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సలహాలు, సందేహాలు సూచనలు ఇవ్వాలనుకునేవారు 99592 25924 నంబర్‌ను ఉదయం 11 నుంచి 12 గంటల మధ్యలో సంప్రదించాలని తెలిపారు.

ఎంఈవో కార్యాలయంలో ఆధార్ సెంటర్

చొప్పదండి: మండల కేంద్రంలోని ఎంఈవో కార్యాలయంలో విద్యార్థులకు అనుగుణంగా ఆధార్ కేంద్రం ఏర్పాటు చేశామని ఎంఈవో వేణుకుమార్ తెలిపారు. విద్యాధికారి కార్యాలయంలో ఆధార్ పర్మినెంట్ ఎన్‌రోల్‌మెంట్ అవకాశం ఉన్నందున మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు అవకాశం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పాఠశాలల్లో ఒకటి నుంచి పన్నెండో తరుగతి వరకు చదువుతున్న ఐదు నుంచి పదిహేడేళ్లలోపు విద్యార్థులకు ఉచితంగా ఆధార్ అప్‌డేట్ చేస్తామని తెలిపారు. పని దినాల్లో మాత్రమే సెంటర్ తెరిచి ఉంటుందని వివరించారు.

నియామకం


నియామకపత్రం అందుకుంటున్న రమేశ్

జమ్మికుంట: ఎమ్మార్పీఎస్–టీఎస్ జమ్మికుంట మండల అధ్యక్షుడిగా మండలంలోని కోరపల్లి గ్రామానికి చెందిన ఈర్ల రమేశ్ నియామకమయ్యారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుమార్ గురువారం నియామకపత్రం అందజేశారు. నియామకానికి కృషి చేసిన జిల్లా అధ్యక్షుడు సారంగం, జిల్లా కార్యదర్శి లక్ష్మణ్, ఎంఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు శనిగరపు మధు, నాయకులకు రమేశ్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ప్రచారంపై నిఘా

అభ్యర్థుల ఎన్నికల ప్రచారంపై ఎన్నికల సంఘం నిఘా పెడుతోంది. నిబంధనలు అతిక్రమిస్తున్నారా? ప్రచారంలో ఎంత ఖర్చు చేస్తున్నారు అనే అంశంపై ఆధారాలు సేకరిస్తున్నారు. ఖర్చు అభ్యర్థుల ఖాతాలో జమ చేస్తున్నారు. గురువారం కరీంనగర్ మండలం చామనపల్లిలో కరీంనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ఎన్నికల ప్రచారం, వాహనాల కాన్వాయ్‌ను ఎన్నికల స్క్వాడ్ సిబ్బంది వీడియోలో చిత్రీకరించారు. – కరీంనగర్‌రూరల్


చామనపల్లిలో మంత్రి వాహనాల కాన్వాయ్‌ను వీడియో తీస్తున్న స్క్వాడ్ సభ్యులు



శిథిలావస్థలో పశువైద్య కేంద్రాలు

మానకొండూర్‌రూరల్: మండలంలోని పశువైద్య కేంద్రాలు శిథిలావస్థకు చేరాయి. ఏళ్లకొద్ది పాతభవనాల్లో పశువులకు వైద్య సేవలు అందిస్తున్నారు. సరైన వసతులు లేకపోవడంతో డాక్టర్లు పశువులకు వైద్యం సరిగా చేయలేకపోతున్నారు. వర్షాకాలంలో వైద్యులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మరోవైపు మందులు నిల్వ చేయడానికి స్థలం లేక అవస్థలు పడుతున్నారు. మానకొండూర్, పచ్చునూర్‌లో పశువైద్య కేంద్రాలు, చెంజర్ల, అన్నారం, గంగిపల్లి, కొండపల్కల, గట్టుదుద్దెనపల్లి, లక్ష్మీపూర్ గ్రామాల్లో ఉపపశువైద్య కేంద్రాలున్నాయి. పచ్చునూర్, గంగిపల్లి పశువైద్య కేంద్రాలు కూలిపోయే దశలో ఉన్నాయి. సంబంధిత అధికారులు స్పందించి నూతన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయించి కష్టాలు తీర్చాలని పాడిరైతులు, పశువైద్యాధికారులు, సిబ్బంది కోరుతున్నారు.

• 30లీటర్ల నాటుసారా స్వాధీనం

వీణవంక: మండలంలోని చల్లూరు గ్రామంలో 30లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ అక్బర్ హుస్సేన్ తెలిపారు. ఓ వ్యక్తి అక్రమంగా నాటుసారాను తరలిస్తుండగా పట్టుకున్నామని, వీరిపై కేసు నమోదు చేశామని, అక్రమంగా మద్యం, గంజాయి సరఫరా చేస్తే చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

• జాగృతికి పలువురి రాజీనామా

విద్యానగర్(కరీంనగర్): భారత జాగృతికి పలువురు నాయకులు రాజీనామా చేశారు. కరీంనగర్ ప్రెస్ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జాగృతి నాయకులు మాట్లాడారు. జాగృతి సంస్థ రాజకీయ పార్టీకి కొమ్ము కాస్తున్నందున ఆ సంస్థకు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. రాజీనామా చేసిన వారిలో రాష్ట్ర కార్యదర్శి సంగ్రామ్ సింగ్, నాయకులు ఛత్రపతి, రవికాంత్, సుధాకర్, సంపత్, రఘు, తదితరులున్నారు.

భవన నిర్మాణానికి భూమిపూజ

కరీంనగర్: ఉమ్మడి కరీంనగర్ జిల్లా రిజిస్టర్ చిట్‌ఫండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ భవన నిర్మాణానికి గురువారం పద్మనగర్‌లో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు హెచ్.రాజిరెడ్డి, జాయింట్ సెక్రటరీ బి.నర్సింగరావు భూమిపూజ చేశారు. అసోసియేషన్ కోసం సొంత కమ్యూనిటీ హాల్ నిర్మించుకోవడం ఉద్యోగులు, యాజమాన్యాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని, అందరి అవసరాలకనుగుణంగా ఉంటుందని అసోసియేషన్ బాధ్యులు కొనియాడారు. అసోసియేషన్ నాయకులు వేణుమూర్తి, శ్రీనివాస్, సత్యనారాయణరావు, రంజిత్‌కుమార్, రాంమోహన్‌రావు, అనంతరెడ్డి, చంద్రకాంత్, రాంరెడ్డి, హరీశ్, శ్రీనివాస్, రాజు, సంతోష్‌కుమార్, అనిల్‌కుమార్, ప్రశాంతరావు, తిరుపతిరావు, సమ్మయ్య, సురేశ్‌బాబు, నవీన్‌కుమార్, గోపాల్‌రావు, చరణ్‌కుమార్, శ్రావణ్ పాల్గొన్నారు.

అన్నదానంతో ఆత్మానందం

గన్నేరువరం: అన్నదానంతో ఆత్మానందం కలుగుతుందని ప్రముఖ జ్యోతిష్య వాస్తు ఆగమశాస్త్ర పండితులు నమిలకొండ రమణాచార్యులు అన్నారు. మండలంలోని ఖాసీంపేట మానసా దేవి ఆలయాన్ని గురువారం సందర్శించారు. కొద్ది రోజులుగా యజ్ఞ యాగాలు జరుగుతుండటంతోపాటు మూలా నక్షత్రం సందర్భంగా జరుగుతున్న కార్యక్రమంలో పాల్గొన్నారు. అదేవిధంగా అన్నదానం ప్రారంభమై నేటితో వంద రోజులయ్యాయి. నమిలకొండ రమణాచార్యులు అన్నదాన విశేషాలను తెలియజేశారు. అన్నదానం వల్ల అశాంతి తొలగుతుందని, మనిషికి తృప్తినిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ గౌరవాధ్యక్షుడు బద్దం నరసింహారెడ్డి, అధ్యక్షుడు చంద్రారెడ్డి, ఆలయ అర్చకులు నాగసాయిశర్మ, కమిటీ సభ్యులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు